# .... పొదరిల్లూ మాది !



2005



అదో అందమైన భవంతి ! (అది... నాటి భారతదేశం!) అందులో ఎన్నెన్నో అందమైన గదులు! (అవి.... ఆనాటి రాజ్యాలు!) ఒక్కోగదిదీ ఒక్కో ప్రత్యేకత - ఒక్కో అందం !

ఎంతో కష్టపడి కట్టుకున్నారు కాబట్టి, పిల్లలు ఎవరి కిష్టమైన గదిని వాళ్ళు ఎంపికచేసుకున్నారు ! అంతపెద్ద భవంతికి, సొంతదారి అయిన అమ్మని పట్టుకుని: 'మేడంటే మేడా కాదు- గూడంటే గూడూ కాదు - పదిలంగా అల్లూకున్నా పొదరిల్లూ మాది' అంటూ కేరింతలు కొట్టారు - గంతులేసారు ఆ ఇంటి పిల్లలు !

పక్కింటి పిల్లలకి (పొరుగున వున్న విదేశీయులకి) ఈ కేరింతలు విన్పించాయి! 'వీళ్లింత ఆనందంగా ఉన్నారు కదా ! వీళ్ల ఆనందానికి కారణం ఏమై ఉంటుందా?' అన్న కుతూహలంతో - తమ ఇంటి కిటికీలోంచి బయటికి తొంగిచూసారు!

ఎదురిల్లు అందంగా - 'పచ్చ'గా కన్పించింది.

'అబ్బ !... ఆ ఇల్లు ఎంత బావుందో !' అనుకున్నారు.

'ఎప్పుడూ ఈ పాత ఇల్లేనా ? పొరుగింట్లో కొంత కాలం వుందాం!' అనుకున్నారు.

అనుకున్నదే తడవుగా పొరుగింటికి బయల్దేరారు ! తలుపు తట్టారు!

'ఎవరా' అని తలుపుతీసిన పిల్లలు... చెప్పాపెట్టకుండా లోపలికి బిలబిలా వచ్చిన ఎదురింటి పిల్లల్ని చూసి షాక్ తిన్నారు !

ఒక్కక్షణం వాళ్ళ కండలు చూసి భయపడిపోయారు !

తామేమో పసి కూనలు !

ఎదుటి వాళ్ళు బలిష్టులు!

అప్పటికీ వాళ్ళలో బలమున్నవాళ్ళు... వాళ్ళని ఎదిరించారు ! బలం సరిపోని వాళ్ళు... చేష్టలుడిగి నించుండి పోయారు.

వచ్చిన వాళ్ళని అమ్మ చూసింది !

తన పిల్లలకి ఇంకా రెక్కలు రాలేదనుకుందో - వచ్చిన వాళ్ళు వెళ్లక పోతారా అనుకుందో - 'పోనీ, పక్కింటి పిల్లలే కదా !' అనుకుందో - అమ్మ ఆదరించిందీ - అన్నం పెట్టింది.

అమ్మ ఆదరణ మరిచి పోలేకో - ఈ ఇల్లు నచ్చో, వచ్చిన పిల్లలకి తిరిగి తమ ఇంటికి వెళ్ళాలనిపించలేదు సరికదా... 'అమ్మా ! మీ పిల్లలతో పాటు మేమూ ఇక్కడే ఉండిపోతాం -' అన్నారు!

అమ్మది - విశాల హృదయం !

"సరే ఉండండి ! మిమ్మల్ని 'పెంపుడు కొడుకులు' అనుకుంటాను" అంది !

అంతపెద్ద భవంతిలో ఎవరికిష్టమైన గదుల్లో వాళ్లుండి పోయారు!

ఆ పిల్లలూ - ఈ పిల్లలూ 'ఒక్కింటి పిల్లల్లా' కలిసి పోయారు !

అలా కొన్నాళ్లు గడిచాయి....

' బెలూన్స్సోయ్... బెలూన్స్! - రంగు రంగుల బెలూన్స్! చూడముచ్చటైన బెలూన్స్! కొనుక్కుంటారా ?' అంటూ వచ్చారు ఇరుగింటి 'తెల్ల పిల్లలు.' (ఆంగ్లేయులు)

బెలూన్స్‌ని చూడగానే పిల్లలు ఎగిరి గంతేశారు !

'పిల్లలు ముచ్చట పడ్తున్నారు కదా !' అని - అమ్మ - బెలూన్స్ అమ్ముతోన్న పిల్లల్ని లోపలికి పిలిచింది. కొడుకులందరికీ - స్వ పర భేదాల్లేకుండా బెలూన్స్ కొనిచ్చింది.

మర్నాడు 'మిల్లు బట్టలు' తెచ్చారు ! అందాకా - ముతక బట్టలు కట్టుకున్న పిల్లలు మిల్లు బట్టల మీద మోజు పడ్డారు! అవీ కొనిచ్చింది అమ్మ.

రోజుకో కొత్త వస్తువు చూపించడం మొదలెట్టారు తెల్ల పిల్లలు ! ఒక రోజు

ఉప్పు, మరో రోజు చక్కెరా - ఇంకో రోజు గాజులూ.

గాజులు చూసి అమ్మ ముచ్చట పడింది !

ఇంట్లోకి రానిచ్చి చాప పరిచింది !

అమ్మ మంచితనం, అమాయకత్వం ఆసరా చేసుకుని - అదే అదనుగా అప్పటిదాకా చాపమీద కూర్చున్న తెల్ల పిల్లలు లేచి, అమ్మగదిలోకి తొంగిచూసారు.

అన్ని గదులకూ తాళాలు వేసి - అమ్మ ఆదమరిచి నిద్రపోతోన్న సమయం చూసుకుని- అమ్మ బొడ్లో దోపుకున్న తాళంచెవి గుత్తిని సంగ్రహించి - ఉక్కుదుటున ఇంట్లోకి చొచ్చుకువచ్చారు తెల్ల పిల్లలు!

అదేమీ తెలీని అమ్మ హాయిగా... నిశ్చింతగా... నిద్రపోతూనే వుంది!

ఒక్కో గదినీ తెరిచారు తెల్లపిల్లలు. కిర్రుమన్నాయి తలుపులు! ఉలిక్కిపడిలేచారు ఆ ఇంటి పిల్లలు. ఆ పిల్లలింకా కళ్ళు నులుముకోకముందే... మెరుపు వేగంతో... పిస్టల్స్ తీసారు. బిక్కుబిక్కుమని చూస్తోన్న పిరిగ్గొడ్డుల్ని భయపెట్టారు! ప్రతిఘటించిన వాళ్ళని మట్టుపెట్టారు ! అయోమయంలో ఉన్నవారిని మచ్చిక చేసుకున్నారు ! ఎలాగైతేనేం... అన్ని గదుల మీదా పట్టు సాధించి, అందర్నీ లొంగదీసుకున్నారు!

కొద్దికాలం గడిచింది. తెల్ల పిల్లల అరాచకాలు మొదలయ్యాయి. తమ అడగులకి మడుగులొత్తాలని తెల్ల పిల్లలు శాసించినపుడు గానీ- తాము పోగొట్టుకుందేమిటో ఈ ఇంటి పిల్లలకి తెలిసి రాలేదు!

క్రమేణా... తెల్లపిల్లల పట్ల వ్యతిరేకత ప్రబలింది ! తమ ఇంట్లో పరాయి పిల్లల అజమాయిషీ ఏమిటనుకున్నారు ! ముఖ్యంగా 'తూర్పుగది'లో ఉన్న బెంగాలీ పిల్లల్లో చైతన్యం మొదలైంది ! ఆలోచనలు రేకెత్తించే అంశాలతో ఆర్టికల్స్ రాయడం మొదలెట్టారు !

తెల్లపిల్లలు అది పసిగట్టేసారు ! ఈ నిరసన ధోరణి ఉధృతం కాకముందే - దాన్ని అణిచి వేయాలనుకున్నారు ! ఆ నిరసన జ్వాలల్ని ఎలా ఆర్పాలా - ఆ పచ్చని ఇంట్లో ఎలా చిచ్చు పెట్టాలా అని పథకాలు వేసారు ! ఏ గదిలో కన్న కొడుకులున్నారో - ఏ గదిలో పెంపుడు కొడుకులున్నారో ఆరా తీశారు ! ఏ గదులు 'కలిపి'తే - ఏ గదుల మధ్య 'అడ్డుగోడలు కడ్తే' - ఏ పిల్లలు మైనార్టీలో పడ్తారో లెక్కలేసారు !

అందుకు తూర్పుగదే అనువైనదిగా ఎంచుకున్నారు !

అనుకున్న వెంటనే.... 'ఆ గదిలో అడ్డుగోడ కడ్తాం!' అన్నారు తెల్లపిల్లలు.

'ఒద్దు' అన్నారు ఈ పిల్లలు !

అయినా తెల్ల పిల్లలు విన్పించుకోలేదు ! ఆ గది విభజనకి హుకుం జారీ చేశారు!

అంతే - ఆ తెల్ల పిల్లల కుతంత్రాలకి రగిలి, ఈ పిల్లలంతా ఏకమయ్యారు!

అమ్మని తలచుకున్నారు! అంతకు ముందెప్పుడో - ముప్పైఏళ్ళకిందట - బంకిం చంద్ర చటర్జీ రాసిన 'వందేమాతరం'ని పల్లవిగా చేసుకుని - 'వందేమాతరం' అంటూ ఉద్యమించారు! అందరూ ఒకటై - 'మనకీ విదేశీ వస్తువులొద్దు - 'స్వదేశీ' వస్తువులనే వాడుదాం' అంటూ.... అన్నాళ్లూ తెల్ల పిల్లలు తమ కిచ్చిన వస్తువులన్నీ గుట్టలు గుట్టలుగా పోసి నిప్పంటించారు!

అలా జాతి ఒకటైంది ! వందేమాతరం ఉద్యమం... ఇలా జాతీయోద్యమానికి బీజం వేసింది.

❋ ❋ ❋ ❋ ❋

ఈ ఉద్యమంలో - ముఖ్యంగా - 'స్వరాజ్యం మా జన్మహక్కు ! మమ్మల్ని ఒకరు పాలించేది ఏమిటీ ?' అంటూ పిలుపునిచ్చారు బాల గంగాధర్ తిలక్. లాల్, పాల్, బాల్ గా పిలువబడే ఈ ఉద్యమకారులు: లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్ర పాల్ , బాలగంగాధర్‌తిలక్ ! వీరికి అరవింద్ ఘోష్ తోడయ్యారు! ఈ నలుగురూ 'ఆతివాదుల' నాయకులకీ.... పితామహులు !

'స్వరాజ్యం చేజిక్కించుకోవడానికి మనకున్న బలం ఇప్పుడే సరిపోదు ! కాబట్టి- మనదేశంలో ఇంకొంతకాలం ఆంగ్లేయుల పాలన ఉన్నాసరే - పాలనలో భారతీయులకి ప్రాతినిధ్యం ఉండాలీ - తద్వారా మన హక్కుల్ని సాధించుకోవాలి!' అన్నారు 'మితవాదుల' నాయకులు... గోపాల కృష్ణ గోఖలే, దాదాబాయి నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, రాన్‌డే.

అతివాదుల, మితవాదుల వాద వివాదాలనూ, భేదాభిప్రాయాలనూ ఆసరా చేసుకుని, ముస్లిముల్లో అభద్రతా భావాన్ని రేకెత్తించారు ఆంగ్లేయులు !

అది 'ముస్లింలీగ్' ఆవిర్భావానికి మూలకారణమైంది ! అయినప్పటికినీ - చాలామంది మహమ్మదీయులు సైతం 'ముస్లింలీగ్'ని బలపరచకుండా - వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నారు ! అందులో ముఖ్యులు: మౌలానా అహమ్మద్ అలీ, హకీం అజ్మల్ ఖాన్, హసన్ ఇమామ్.

ఇహ లాభంలేదని బ్రిటిష్ వాళ్ళు - 'విభజించు - పాలించు' అన్న విధానాన్ని ఎన్నుకుని 'మింటో - మార్లే' సంస్కరణల ద్వారా - ముస్లింలకి ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పాటు చేసారు ! అది అగ్నికి ఆజ్యం పోసినట్టై - దేశంలో చిచ్చుపెట్టింది! హిందూ ముస్లింల ఐక్యతని దెబ్బ తీసింది.

అయినా ఉద్యమం ఆగలేదు !

చివరకు.... ఉద్యమ స్ఫూర్తికి ఝడిసి - ఆంగ్లేయులు వందేమాతరం ఉద్యమానికి ముఖ్యకారణమైన బెంగాల్ విభజనని 1911లో రద్దు చేయడంతో - ఆరేళ్ళపాటు సుదీర్ఘంగా సాగిన వందేమాతరం ఉద్యమం ముగిసింది !

వందేమాతరం ఉద్యమంలో పాల్గొని - లాఠీదెబ్బలు తిన్న ఉద్యమ కారులను స్మరించుకుంటూ - ఆ ఉద్యమంలో ఆసువులు బాసిన అమరవీరులకి - ఈ

వందేమాతరం శత జయంతోత్సవాల సందర్భంగా జోహార్లు అర్పించడం... ఆ ఉద్యమ ఫలాలను అనుభవిస్తోన్న మనందరి కనీస ధర్మంగా భావిస్తూ.... నాకీ అవకాశం కల్పించిన 'వందేమాతరం ఉద్యమ శతాబ్దిసమితి - ఇందూరు జిల్లా వారికి ధన్యవాదాలు సమర్పించుకుంటున్నాను.

★ ★ ★

ఒకమాట ! నేనింతవరకూ చెప్పింది... నాటి కథ ! నేటికథ... నా రచన..... శ్రీమతి కవితాదివాకర్ గారి నోట 'పాట'రూపంలో మీరిప్పుడు వింటారు.

★ ★ ★

**మన లౌకిక రాజ్యమూ... ॥ జయహో - జయహో ॥**
**జగద్విఖ్యాతమూ.... ॥ జయహో - జయహో ॥**
**విశ్వానికి... అబ్బురం - బహుమతాల సంగమం**
**బహుమతాల సంగమం ॥ మన॥**

**అలాంటి మన భారతంలో -**
**కాశ్మీరంలోనా - మిలిటెంట్ల ఘీంకారం !**
**అస్సాంలో సైతం - ఉల్ఫా 'అరాచకం' !**
**తెలుగు నాట కాలిడ్తే - తీవ్రవాద ప్రాబల్యం !**
**తీవ్రవాద ప్రాబల్యం !**

**ఆట బొమ్మలాయే - బాంబులు - స్టెన్ గన్నులూ !**
**అయ్యో.....**
**ఆట బొమ్మలాయే - బాంబులు - స్టెన్ గన్నులూ !**
**జాతి నిర్వీర్యమయ్యే - చేవచచ్చి, చేష్టలుడిగి -**
**చేవచచ్చి, చేష్టలుడిగి !**

**ఎవడురా ఉగ్రవాది ?**
**ఎవడురా ఉగ్రవాది ?**
**ఏ దేశపు అండ అదీ.... ?**
**దేశాన్నీ ముక్కలుగా - నరికే 'అకృత్య'మదీ...**
**ఆ...... ఆ...... ఆ.....**
**మన తోడబుట్టినోడే - దేశభక్తి ఉన్నవాడే - ॥దేశభక్తి॥**
**భరతమాత సంకెళ్ళను - మనతొపాటె తుంచినోడే - ॥మనతొపాటె॥**
**తెల్ల దొరల గుండెల్లో - గుబులు దిగులు రేపినోడే - ॥ గుబులు దిగులు॥**

ఎవరిమాట వినో నేడు - ఇంట చిచ్చుపెట్టినాడు - ॥ ఇంట చిచ్చు॥
మనవాడే వాడు నేడు - సమైక్యతని కాలదన్ని.... ॥ సమైక్యతని॥
'ఏదేదో' పేరు చెప్పి - మనల హింసించెనే....
ఊచకోత కోసెనే.... !

దారుణం..... దారుణం..... అకారణం !

కుల రక్కసి - మతపిశాచి - పెడరెక్కలు విరిచి కట్టి
కుల రక్కసి - మతపిశాచి - పెడరెక్కలు విరిచి కట్టి - ॥పెడరెక్కలు॥
ఉగ్రవాద పడగమీద - ఉక్కుపాదం మోపి - ॥ ఉక్కుపాదం॥
శాంతికై - ప్రశాంతికై - నిరంతరం శ్రమిద్దాం - ॥ నిరంతరం ॥

పచ్చగ ఉండే దేశంలోనా - భగ్గున మంటలు ప్రజ్వరిల్లితే - ॥ భగ్గున॥
దిగ్గున లేచి చల్లార్పెదమూ - ఉగ్రవాదులా ఆటలు కట్టీ ! - ॥ ఉగ్రవాదులా॥

వందే-ఆ...ఆ....ఆ...

వందేమాతరం ! వందేమాతరం ! వందేమాతరం ! వందేమాతరం !

ఆ...ఆ....ఆ...

వందేమాతరం ! వందేమాతరం ! వందేమాతరం ! వందేమాతరం !

★ ★ ★

*Speech delivered by Amrutha Latha in connection with 'Vandemataram Centenary movement' on 29-8-2005 at Lakshmi Kalyana Mandapam, Nizamabad..*

దేశం పచ్చగా ఉండాలని పరితపించే దేశభక్తులకి.....

గౌరవాభిమానాలతో.......



1-11-2005